క్లుప్తంగా

వైఎస్సార్ బీమా వందశాతం పూర్తి చేయాలి

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా వైఎస్సార్ బీమా ఈకేవైసీని వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేటితో వైఎస్సార్ బీమా ఈకేవైసీ ముగుస్తుందని.. కనుక వలంటీర్లు ఏ ఒక్క ఇంటిని వదలకుండా ఈకేవైసీ నేటికల్లా వందశాతం పూర్తి చేయాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మండల కేంద్రంలోని వలంటీర్లు తమ పరిధిలోని జగనన్న ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు బుధవారం 10 గంటలకు స్థానిక చెత్త సేకరణ కేంద్రంలో లబ్ధిదారులకు సమీక్ష సమావేశం ఉంటుందన్నారు.

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని రక్తనిధి మెడికలాఫీసర్ డాక్టర్ దివ్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరాలకు ప్రముఖులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు, కార్య నిర్వాహకులు తప్పకుండా హాజరుకావాలన్నారు. నెల రోజులపాటు ప్రపంచ రక్తదాన దినోత్సవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని.. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు తరలి రావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ముద్దనూరు : ఎటువంటి దుష్ఫలితాలు లేని ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుల గురువాయిపల్లె గ్రామంలో విత్తనశుద్ధి కార్యక్రమాన్ని ఏడీఏ పరిశీలించారు. పత్తి విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధిచేసి 1 ఎకరాకు 600 కిలోల ఘనజీవామృతం కలిపి సారవంతం చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం లాభసాటి అని ఆయన సూచించారు. 13జెయమ్‌డీ301: విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న ఏడీఏ, తదితరులు

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి



ఘన జీవామృతాలను తయారు చేస్తున్న సిబ్బంది

సింహాద్రిపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారని ప్రకృతి వ్యవసాయ మెంటర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సింహాద్రిపురంకు చెందిన రజిత అనే మహిళ చీనీ తోటలో 50 సెంట్లు సాగు చేసిన కూరగాయల సాగును ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటల సాగుకు అధిక పెట్టుబడులు అవుతున్నందున ప్రకృతి వ్యవసాయంతో ప్రకృతి సిద్ధమైన ఘనామృతం ద్వారా సాగు చేయడంవల్ల రైతుకు పెట్టుబడులు తగ్గి ఎక్కువ ఆదాయం వస్తుండటంవల్ల కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ వెంకటరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరాలు

కడప రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈ మేరకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన దినోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాల ను కడపతో పాటు ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

పవిత్ర హజ్ యాత్ర చేయడం అదృష్టం

కడప కల్చరల్ : పవిత్ర హజ్ చేయగల్గడం అదృష్టమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష తెలిపారు. మంగళవారం కడప నగరం కృష్ణా సర్కిల్‌లోని షాహి దర్బార్ సమావేశ మందిరంలో స్థానిక ట్రావెల్స్ అధినేత అస్మతుల్లా ఆధ్వర్యంలో పవిత్ర హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్ర చేస్తున్న వారంతా ఎంతో అదృష్టవంతులుగా భావించాలన్నారు. వారందరికీ దైవ కృప ఉండడంతోనే ఈ అవకాశాన్ని పొందగలుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హజ్ యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యాత్ర నిర్వాహకులు యాత్రికులకు తెలిపారు. అనంతరం వారికివ్యాక్సినేషన్ చేసి యాత్రకు అవసరమైన కిట్లతో కూడిన వస్తువులను అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని వెల్లటూరు దళితవాడ, గోపులాపురం, రెడ్డిపల్లె, శవాస్కన్‌పల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఆయన గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వెల్లటూరు దళితవాడలో సీసీ రోడ్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృషికి తీసుక వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, హుస్సేన్, సుదర్శన్‌రెడ్డి, గురివిరెడ్డి, విశ్వం, బాలు, నాగార్జునరెడ్డి, ఈశ్వరయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులలో పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలో పాల ఉత్పత్తులపై పురోగతి సాధించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని పశువైద్యాధికారులు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, సీసీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాల సేకరణ తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేసి పాల సేకరణ ఉత్పత్తులను పెంచే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం 12 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందని.. వాటిని 20 వేల లీటర్లకు పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాడి గేదేల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ డెయిరీలకు దీటుగా పాల ధరలను ప్రభుత్వం నిర్ణయించిందని.. పాల ఉత్పత్తులను పెంచే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు, ఏపీఎంలు, సీసీలు మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాల సేకరణ తక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, వెటర్నరీ జేడీ శారద, డీసీఓ సుభాషిణి, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, డీపీఎం మాలకొండయ్య, డీఆర్డీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మునిరెడ్డి మృతి.. ఎమ్మెల్యే నివాళి



మారుజోళ్ల మునిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఇన్‌సెట్‌లో మునిరెడ్డి(ఫైల్)

కమలాపురం : కమలాపురం మునిసిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మారుజోళ్ల మునిరెడ్డి (74) మృతి చెందారు. సోమవారం ఆయనకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఉదయం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మునిరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారని, ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. పార్టీ ఆవిర్భావం పార్టీ బలోపేతానికి కృషి చేసిన మునిరెడ్డి సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. మునిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



విద్యార్థిని విద్యా కానుక కిట్లను అందిస్తున్న లింగాల ఉషారాణి

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. వేల్పుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్ల ను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్య తోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ము ద్ద వంటి పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకనుగుణంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో ఎంపీటీసీ బాబ్‌జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు వేంపల్లె శాఖలో సమ్మర్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి ఆధ్వర్యంలో పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. గతనెల 8వ తేదీనుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశారు. 35 రోజులపాటు పిల్లలకు ఆటల పోటీలు, ఖోఖో, కబడ్డీ, బుక్ రీడింగ్, కథలు, పాటలు, డ్రాయింగ్ తదితర వాటిని నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగిసిన అనంతరం వివిధ పోటీలలో పాల్గొన్న పిల్లలకు రిటైర్డు టీచర్ వెంకటరామిరెడ్డి చేతులమీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో ఉత్తమ ఫలితాలు

లింగాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతనెల నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 22 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 44 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 41 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి తెలిపారు. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాల చేరే నిరుపేద విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని ఆయన తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో ఫోరంలేక సమావేశం ఆగిపోయిందన్నారు. వచ్చే వారంలో ఈ సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఎర్రగుంట్ల ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి నియామకం



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎన్.భాగ్యలక్ష్మి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతిపై ఎర్రగుంట్ల మండలంకు బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

25శాతం ఉచితంగా సీట్లు అమలు కావాలి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునేటందుకు 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేవిధంగా చర్యలను తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యుడు వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

భక్తి శ్రద్ధలతో పూజలు

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లెలో నూతనంగా వెలసిన సీతారామ లక్ష్మణ హనుమత్సమేత దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని అభిషేకాలు, హోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

రెండవ రోజు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల మంత్రోచ్ఛారణలతో పునఃకలశ స్థాపన, యంత్రాలకు అభిషేకం, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, రుద్ర హోమా లు మహా మంగళ హారతి, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం మహాస్నపకము, కలశపూజ, గణపతి, ఆదివాస్, దీక్షా హోమాలు, ధాన్యాది వాసము, శయ్యాధి వాసము, ఫలాధివాసము, పుష్పాదివాసము, స్వస్తి మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె జన భాగీధారీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లోని చిన్నారులను ఎక్కువ శాతం నమోదు చేసుకుని వారికి కావాల్సి ఆట సామగ్రి, పలు పుస్తకాలను ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. చిన్నారులకు ఆరు సంవత్సరాల నుంచి మంచి పౌష్టికాహారాన్ని అందించి మానసికంగా, శారీరకంగా ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీ



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

పులివెందుల రూరల్ : పట్టణంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులు కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి కడప బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ కొనసాగడంవల్ల సమాజంలో అనిశ్చితి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ అల్లా బకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సంఘ సభ్యులుగా ఉంటేనే ప్రభుత్వ ఫలాలు



ఎట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

జమ్మలమడుగు : ప్రతి మహిళ డ్వాక్రా సంఘాలలో సభ్యురాలిగా చేరినప్పుడే వారికి సంక్షేమ ఫలాలు అందుతాయని మండల సమాఖ్య ఏరియా కో ఆర్డినేటర్ ధనుంజయ తెలిపారు. మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించిన అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో ఉన్న సభ్యులు సభ్యులుగా లేని వారిని గుర్తించి వారిని సంఘ సభ్యులుగా చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులుగా చేరితే వచ్చె లాభాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యకేంద్రం వైద్యులు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధి మోరగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మలేరియా జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తస్మియా తహసిన్ మాట్లాడుతూ మలేరియా జ్వరాలు జులై మాసం నుంచి డిశంబర్ మాసం లోపల వచ్చె అవకాశలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. రాత్రి నిద్రించే సమయంలో ప్రతి ఒక్కరూ దొమతెరలను వాడలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

లింగాల : స్థానికంగా ఉన్న పెద్దమ్మ దేవతకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. గంగమ్మ దేవతను స్థాపించి 41 రోజులు పూర్తి కావడంతో ప్రత్యేక పూజలతోపాటు బోనాలు సమర్పించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే ధర నిర్ణయం



సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు

ఎర్రగుంట్ల : ప్రభుత్వ నిబంధనల మేరకే భూములకు ధర నిర్ణయం ఉంటుందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలో వై.కోడూరు, పెద్దనపాడు, టీ సుంకేసుల, తిప్పలూరు గ్రామాల మీదుగా వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే (బెంగుళూరు, కడప, విజయవాడ) వెళ్తుతుంది. అందుకు గాను టీ.సుంకేసుల, తిప్పలూరు, పెద్దనపాడు, వై.కోడూరు గ్రామాలకు చెందిన భూములు పోతున్నాయి. మంగళవారం టీ సుంకేసుల గ్రామాల రైతులతో ముఖాముఖీ సదస్సును జేసీ నిర్వహించి మాట్లాడారు. ఈ గ్రీన్ ఫీల్డ్ హైవేకి సంబంధించి కడప రోడ్డులోని టీ సుంకేసుల గ్రామ పరిధిలో జంక్షన్ ఏర్పాడుతోందని అందుకు కావాల్సిన భూమి కోసం రైతులు సహకరించాలన్నారు. మండల పరిధిలోని 4 గ్రామాలలో ఈ దారి కోసం మొత్తం 120 ఏకరాలు భూమి, 122 మంది రైతులు ఉన్నారన్నారు. వారందరికి ప్రభుత్వం నిర్ణయించిన ధర అందుతుందన్నారు. రైతులు కూడా వారి సందేహాలను తెలియజేస్తే వాటిని జిల్లా ఉన్నతాధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేసవి పత్తి సాగు



గొందిపల్లె వద్ద సాగులో ఉన్న వేసవి పత్తి పంట

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. గత ఏడాది ధరలు బాగా ఉండటంతో ఈ ఏడాది వేసవిలో పత్తి సాగుపైనే దృష్టి పెట్టారు. వ్యవసాయ బోర్లు, బావుల కింద విస్తారంగా పత్తి పంట సాగైంది. సాగులో పెట్టుబడులు తక్కువగా ఉండి దిగుబడులు బాగా ఉండటంతో రైతులంతా పత్తి పంట వైపు మొగ్గు చూపారు. మామూలుగా పత్తి పంటను వర్షాధారం కింద జులై నెలలో సాగు చేస్తారు. వ్యవసాయ బోర్ల కింద మార్చి చివరి వారం నుంచే పత్తి సాగు ప్రారంభించారు. ఇప్పటికే పంట సాగు చేసి 80 రోజులు కావస్తోంది.

పూత, పిందెలతో పత్తి పంట :

వేసవిలో సాగు చేసిన పత్తి పంట పూత, పిందెలతో ఉంది. పంటకు సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో ఏపుగా పెరిగింది. పంట పెరగడంతోనే కాయలు బాగా ఉంటాయని రైతులు అంటున్నారు. ఒక్క చెట్టుకు 40 నుంచి 50 కాయల వరకు ఉండే అవకాశం ఉంది. పంట రైతులను ఊరిస్తోంది. పంట బాగుండటంతో రైతులు సకాలంలో కలుపు తీయడం, ఎరువులు వేయడం, నీటితడులు ఇస్తున్నారు. మరో నెలరోజులలో పత్తి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు :

పత్తి పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తగా రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. తెల్ల దోమ, పచ్చ దోమ ఎక్కువగా సోకుతుంది. దీంతో రైతులు 20రోజులకొకసారి మందులను స్ప్రే చేస్తున్నారు. ఇప్పటికే నాలుగుసార్లు పంటకు మందులను స్ప్రే చేశారు. మరో రెండు సార్లు మందులను స్ప్రే చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. సాగులో దిగుబడులు ప్రారంభమయ్యే వరకు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవాల్సి ఉంటుందని రైతు చెబుతున్నారు. ఒకసారి ఎకరాకు మందు స్ప్రే చేసేందుకు రూ.1000లు వెచ్చిస్తున్నామన్నారు.

దిగుబడులపై రైతుల ఆశలు :

వేసవి పత్తి సాగులో దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది ముందుగానే సాగు చేయంతో ముందుగా దిగుబడులు అందనున్నాయి. గత ఏడాది ఎకరాకు 15క్వింటాళ్ల మేర దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది కూడా ఎకరాకు అంత మేర దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని రైతులు అంటున్నారు.. పత్తి సాగు చేశాక వర్షాలు రావడంతో కాయలు బాగా లావుగా ఉన్నాయని.. పత్తిపైనే ఆశలు పెట్టుకున్నామని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో.. :

ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో పత్తి సాగైంది. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా.. మిగిలిన మండలాల్లో అక్కడక్కడ రైతులు పత్తి పంటను సాగు చేసుకున్నారు. ఎక్కువగా సూపర్ బంటి, ప్రాఫిట్ ప్లస్, వర్దిని గోల్డ్, సుగ్రీవ వంటి రకాల పత్తి పంటను సాగు చేసుకున్నారు.

ధరలపైనే రైతులలో ఆందోళన.. :

ఈ ఏడాది పత్తి ధరలపైనే రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది క్వింటా పత్తి రూ.10,800లు ధర పలికింది. గత ఏడాది దిగుబడులు ప్రారంభం నుంచే మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండేవి. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు మార్కెట్ ధరలు బాగా తగ్గాయని.. దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఉంటాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ధరలు ఉంటే సాగులో ఆదాయం ఉందని.. ధరలు లేకపోతే నష్టపోతామని రైతులు అంటున్నారు.